బసచేస్తే అలా బస చేసిన ప్రతీ రాత్రికి వెయ్యి మైళ్ళ చొప్పున అతని ఫ్రీక్వెంట్ ఫ్లయర్ క్లబ్ అకౌంట్‌లో కలుపుతారు. అలాగే ఫలానా కంపెనీ కారు అద్దెకి తీసుకుంటే ఇంకొంత మైలేజి కలుస్తుంది. (అమెరికా నించి చాలా మంది ఫ్రీ టిక్కెట్ల మీద ఇండియాకి ఈ పద్ధతిలో వస్తూండడం నాకు తెలుసు.)

ఇలా ప్రతి వ్యాపార సంస్థ కొనుగోలుదార్లని ఆకట్టుకోడానికి అనేక ఉచిత బహుమతి ఆకర్షణలు అందిస్తూంటాయి.

మనిషి స్వభావ సిద్ధంగా దురాశగలవాడు కాబట్టి ఇలాంటి ఉచిత బహుమతుల కోసం ఎగబడటం అమెరికాలో జరుగుతోంది. ఎటొచ్చి ఏ వ్యాపార సంస్థ వుచితంగా ఏదీ ఇవ్వదు. మన ద్వారా పొందిన లాభంలోంచి ఇస్తుంది తప్ప కాని లాభంలోని కొంత శాతం ఇలా ఇవ్వడం అందరీనీ ఆకర్షస్తూంటుంది.

ఖరీదు తగ్గించేకంటే మామూలుగా వుంచి 'ఉచితం' అంటే సంతోషపడటం మానవనైజం అన్న సిద్ధాంతంమీద ఇవి తయారవుతాయి.

# టెలిఫోన్ ఆన్సరింగ్ మెషీన్

బాత్‌రూంలో స్నానం చేస్తుంటే ఫోన్ మోగడం వినిపిస్తుంది. గబ గబ నాలుగు చెంబుల నీళ్ళు కుమ్మరించుకుని టవల్ చుట్టుకుని ఫోన్ దగ్గరకు పరిగెత్తితే, రిసీవర్ మీదికి చెయ్యి వెళ్ళగానే ఫోన్ మోగడం ఆగిపోతుంది. ఫోన్ చుట్టూ కార్పెట్ మీద నీళ్ళు.

లేదా సినిమా నించి ఇంటికి తిరిగి వస్తే రాత్రి పదిన్నరకి ఫోన్ మోగడం గేటు దగ్గరే వినిపిస్తుంది. గబ గబ తలుపు తెరుచుకుని ఇంట్లోకి అడుగుపెట్టి లైట్ వేసి ఫోన్ వైపు నడిస్తే, అది అడుగు దూరంలో వుండగా రింగ్ ఆగిపోతుంది.

లేదా ఇల్లు తాళం వేసి కారు దగ్గరికి వెళ్ళి. డ్రయివింగ్ సీట్లో

కూర్చుని స్టార్ట్ చేయగానే ఫోన్ మోగడం వినిపించి దిగి ఇంట్లోకి పరుగెత్తితే మనం ఫోన్ దగ్గరికి వచ్చిన సంగతి ఆవతలివాళ్ళకి తెలిసి నట్లుగా తక్కున గణగణ శబ్దం ఆగిపోతుంది.

ఫోన్ వున్న వారందరికి పై మూడు సంఘటనలు అనుభవమే అని నొక్కి వక్కాణించవచ్చు. ఇంకా ఇలాంటి సందర్భాలు అనేకం తారస పడుతుంటాయి. దాంతో ఆఫోన్ ఎవరినించా అన్న ఆలోచన కాసేపు వెంటాడక మానదు. ఫోన్ దగ్గరికి వెళ్ళగానే మోగడం ఆగితే అది అతి పెద్ద టెన్షన్‌ని సృష్టిస్తుంది. మనిషిని బట్టి అనేక ఆలోచనలొస్తాయి.

—లాయర్‌నించా ఆ ఫోన్? కేసు గెలిచామా, ఓడామా ? (దావాలో ఇరుక్కున్నవాడు)

—ఈ టైంకి ఫోన్ చేసేది లతే. సాయంత్రం సినిమాకి వెళ్దామని ఫోన్ చేసుంటుందా? (ప్రేమలో పడ్డవాడు)

— నాకు ప్రమోషన్ వచ్చిందని చెప్పడానికి కొలీగ్ చేసుంటాడా? (సిక్ లీవ్‌లో వున్న వుద్యోగి).

—ప్రొడ్యూసర్ కాని మనసు మార్చుకుని 'నీ నవల సినిమా తీస్తాం' అని ఫోన్ చెయ్య లేదుకదా? (నావలిస్ట్)

—నాకు సన్మానం చేయమని. నీ రేటు నాకు ఓకే అని సినీనటుడు చేసాడేమో? (ఆ వ్యవహారం నడిపించేవాడు)

ఓ ఫోన్ ఎత్తకుండా మోగడం ఆగితే, అంతాఇలా సవాలక్షమంది మనుషుల్ని తలచుకుంటారు.

ఇలాంటి సమస్యలో యిరుక్కున్న అమెరికన్ సైంటిస్ట్‌లు ఓ పరికరాన్ని కనిపెట్టారు. ఫోన్‌కి కనెక్ట్ చేసే దీని పేరు 'టెలిఫోన్ ఆన్సరింగ్ మెషీన్'. అది యింట్లోని ఫోన్‌కి కనెక్ట్ చేస్తే, ఇంట్లోంచి బయటకి వెళ్ళే ముందు దాన్ని ఆన్ చేస్తే, మూడు లేక నాలుగు రింగుల తర్వాత ఆ యంత్రంలో ముందుగా రికార్డు చేసి వుంచిన టేప్ ఆన్ అయి అవతలివారికి మెసేజ్ వినబడుతుంది. 'నేను యింట్లో లేను. రాగానే మీకు ఫోన్ చేస్తాను. మీ పేరు, ఫోన్ నంబరు, మెసేజ్ 'బ్లీప్' శబ్దానంతరం మీరు చెప్తే రికార్డవుతుంది అని. ఫోన్ చేసినవారు ఆ

నాలుగు ముక్కలు చెప్తే, సదరు ఫోన్ యజమాని యింటికి తిరిగి వచ్చాక, టేప్‌ని ఆన్ చేసి తను లేని సమయంలో ఎవరు ఫోన్ చేసారో రికార్డయింది వినచ్చు.

మన దేశంలో ఈ పరికరం ఫోన్‌కి అమర్చడం రాజీవ్‌గాంధీ పి. ఎం. అయేదాకా నేరం. బయటపడితే ఫోన్‌ని డిస్‌కనెక్ట్ చేసేవారు, అందువల్ల టెలిఫోన్ డిపార్ట్‌మెంట్ వారికి ఎలాంటి నష్టం లేకపోయినా. (మన ప్రభుత్వ పాలసీలన్నీ ప్రజలు సౌకర్యవంతంగా బ్రతకూడదు అన్న పాయింట్ మీద రూపొందించ బడుతుంటాయి) అయితే రెండేళ్ళ క్రితం అనుకుంటా వీటిని వుపయోగించుకోవచ్చు అనే రూల్ వచ్చింది. ఇప్పుడు చాలా మంచి ఆన్సరింగ్ మెషీన్స్‌ని ఇళ్ళలో, ఆఫీసుల్లో వినియోగిస్తున్నారు. ముఖ్యంగా యిల్లు తాళం వేసి వూరెళ్ళే వారికిది సదుపాయంగా వుంటుంది.

టి. వి. లో చిత్రహార్‌ని సీరియస్‌గా చూస్తుండగా ఎవరయినా ఫోన్ చేస్తే రిసీవర్ అందుకున్నాక అన్ని పాటలు అయిపోయినా అవతలి వ్యక్తి మాట్లాడటం ఆపకపోవడం అనే అనుభవం వున్న వారు చెయ్యెత్తండి....నేనూ ఎత్తాను. లేదా ఎవరితోనో ముఖ్యమయిన విషయం—అంటే పెళ్ళి చూపులో, యింటి ప్లేన్‌లో మార్పులు చెప్పడమో లాంటివి మాట్లాడుతుంటే ఎవడో ఫోన్ చేసి, 'ఏం లేదు. ఊర్కే చేసా' అని చెత్తో, గాసిపో కాసేపు మాట్లాడి టైంపాస్ చేస్తాడు. ఇలాంటి సందర్భాల్లో ఫోన్స్ అన్నీ ఆన్సరింగ్ మెషీన్ ఎటెండ్ అయేలా ఏర్పాటు చేసుంటే డిస్టర్బెన్స్ వుండదు. అలాగే రాత్రుళ్ళు కూడా ఆన్సరింగ్ మెషీన్స్ ఆన్ చేసి పడుకుంటే ఫోన్ మోగడం వల్ల మెలకువ రాదు. హోటల్ గదుల్లోని డోంట్ 'డిస్టర్బ్' సైన్ లాంటిదన్న మాట ఆన్సరింగ్ మెషీన్ అంటే.

ఫోన్‌లో దొరికిపోకుండా ఆన్సరింగ్ మెషీన్‌ని సదా వుపయోగించి, అవసరం వున్నవాళ్ళకే తిరిగి ఫోన్ చేయచ్చు. అంటే 'నా అప్పెప్పుడు తీరుస్తావు?' అనే ఫోన్ కాల్స్ అధికంగా వచ్చే వారికి

యిది బాగా వుపయోగంగా వుంటుంది.

ఎదురు చూసే కాల్ వచ్చిందా, రాలేదా అనే సస్పెన్స్‌కూడా ఈ పరికరం తీరుస్తుంది. ఓ ముఖ్యమయిన కాల్ కోసం ఎదురు చూసి చూసి, బైమైపోయిందని ఏ పోస్టాఫీసుకో లెటర్ రిజిస్టర్ చేయడానికో లేదా పాలకో వెళ్ళి పది నిమిషాల్లో తిరిగి వచ్చాక 'అయ్యో....బయటి కెళ్ళినప్పుడు వాళ్ళు ఫోన్ చేసారేమో' అనుకుని బాధ పడాల్సి వస్తుంది, ఆ తర్వాత కూడా అది రాకపోతే.

అలాగే 'ఫోన్ చేసా కాని మీ ఇంట్లో ఎవరూ ఫోన్ ఎత్తలేదని ఫోన్ చెయ్యకుండా అబద్ధం ఆడేవాళ్ళ బండారం తక్కున బయట పెడుతుందీ యంత్రం.

కొందరికి మనుషులతో తప్ప యంత్రాలతో మాట్లాడటం యిష్టం వుండదు. అది ఆన్సరింగ్ మెషీన్ అని తెలియగానే ఫోన్ పెట్టేస్తారు. ఈ యంత్రం అలాంటి సందర్భాల్లో వుపయోగించ డానికే కనిపెట్ట బడిందన్న సంగతి వాళ్ళకి తోచదు. కొందరు కొత్తవాళ్ళు ఆన్సరింగ్ మెషీన్‌లోని టేప్‌లో వినబడే మాటలు టేప్‌లోవి కావని, జోక్‌గా ఆ మనిషే అక్కడ వుండే మాట్లాడుతున్నాడని భావిస్తారు.

'నేను మల్లాదిని మాట్లాడేది. నేనిక్కడ లేను' అని చెప్పడం హాస్యాస్పదంగానే వుంటుంది. అయినా 'నేనిక్కడ లేను. 'లాంగ్ బీప్' శబ్దం వినిపించాక మీ పేరు, మీ ఫోన్ నంబరు, మెసేజ్ ఫోన్‌లో చెప్తే నేనొచ్చాక మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాను. థాంక్యు' అని మా యింటికి ఫోన్ చేసిన వారికి వినిపిస్తే 'ఏం మల్లాదిగారూ జోక్ చేస్తున్నా రేంటి?' అన్న మెసేజ్ అనేకసార్లు నా ఆన్సరింగ్ మెషీన్‌లో రికార్డయింది.

ఆన్సరింగ్ మెషీన్‌ని విదేశాల్లో ఫోన్ వున్న ప్రతి ఒక్కరు వుపయోగిస్తుంటారు. అమెరికాకి, ఇంగ్లాండ్‌కి నేను ఎవరింటికి ఫోన్ చేసినా వాళ్ళు నిద్రపోయే సమయం. లేదా ఇంట్లో లేని సమయం అవుతే ఆన్సరింగ్ మెషీన్‌కి నే చెప్పాల్సిన మెసేజ్ చెప్తూంటాను. (దొంగలు ఫోన్ చేసి ఇంట్లో ఎవరయినా వున్నారో లేరో కనుక్కొని రావడానికి కూడా యిది అక్కడ వుపయోగిస్తూంటుంది) మద్రాస్‌లో

సినీ రైటర్ సత్యానంద్ యింట్లో ఆన్సరింగ్ మెషీన్ వుండేది.

ఈ యంత్రంలో అనేక రకాలున్నాయి. ఒకటి పైన చెప్పిన క్రియ చేస్తే కొన్ని టేప్ తిరిగి మెసేజ్ రికార్డయిందా లేదా, ఎన్ని మెసేజ్‌లు రికార్డయ్యాయి కూడా యిండికేట్ చేస్తాయి. ఆ టేప్ పూర్తిగా నిండిపోతే ఎలా? దీనికీ ఓ అడ్వాన్స్‌డ్ ఆన్సరింగ్ మెషీన్ వుంది. మరో ఫోన్‌లోంచి మన ఫోన్‌కి ఫోన్ చేసి అంతదాకా రికార్డయిన మెసేజ్‌లన్నీ వినచ్చు. తర్వాత వాటిని చెరిపేసి మళ్ళీ కొత్త మెసేజ్‌లు రికార్డవడానికి టేప్‌ని తయారుగా పెట్టచ్చు. అంటే యింటి కెళ్ళేదాకా ఆగి ఆన్సరింగ్ మెషీన్‌లో రికార్డయిన మెసేజ్‌లు వినాల్సిన అవసరం వుండదన్న మాట. ఓ ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా ఈ సౌకర్యం ఫోన్ యజమానికి తప్ప బయటి వాళ్ళకి లభ్యం కాదు. కాబట్టి ఆ మెసేజ్‌లు రహస్యంగానే వుంటాయి.

ఈ ఆన్సరింగ్ మెషీన్ వల్ల ఫోన్ బిల్లు పెరుగుతుంది. ఇది లేకపోతే ఫోన్ చేస్తే వారు మళ్ళీ యింకోసారి చేస్తారు. లేదా యింకోసారి ....దొరికేదాకా. కాని యిది వుపయోగిస్తే, తప్పనిసరిగా వాళ్ళకి తిరిగి ఫోన్ చేయాలి. మీ కంఠమే ఆ హామీనిస్తుంది కదా. దానికీ ఓ షార్టుకట్ వుంది. 'సారీ. మెషీన్‌లో టేప్ స్టకప్ అయింది. ఆ టేప్ పాడయింది. ఎవరు చేసారో తెలీలేదు' అన్న అబద్ధంతో తప్పించుకోవచ్చు. కాని ఇది సంవత్సరంలో ఒక మనిషికి ఒకసారే చెప్పదగ్గ అబద్ధం. 'ఈ అబద్ధం ఎవరికి చెప్పాను. మళ్ళీ ఎప్పుడు చెప్పచ్చు' అనే లెడ్జర్‌ని మెయిన్‌టెయిన్ చేయకపోతే కొందరు మిత్రులు దూరం అయి తీరుతారు.

అమెరికాలో ఫిలడెల్ఫియాలోని ఓ బంధువుకి ఆయన నాన్నగారు పోయారన్న వార్తని ఆర్నెల్ల క్రితం ఫోన్ ద్వారా చెప్పాల్సిన బాధ్యత నామీద పడింది. అక్కడ అర్ధరాత్రి కాబట్టి ధైర్యంగా ఫోన్ చేసాను. మూడుసార్లు ఫోన్ మోగేలోగా రిసీవర్ ఎత్తకపోతే ఆ మెషీన్ ఆ కాల్ తీసుకునే ఏర్పాటు అతను చేసాడని నేను అమెరికాలో వాళ్ళింట్లో వుండగా చెప్పాడు. కాబట్టి, కాని రెండో రింగుకే చదువుకుంటున్న అతను ఫోన్ ఎత్తాడు. ఆ చెడ్డవార్తని యంత్రానికి కాక అతనికే నేను

డైరెక్ట్‌గా చెప్పక తప్పలేదు. (మూడోరోజు వుదయానికి హైదరాబాద్‌లో వున్నాడతను). తండ్రి మరణవార్త కొడుక్కి చెప్పటం చేదైంది.

అప్పుడనిపించింది నాకు ఆన్సరింగ్ మెషీన్స్ తమలో తాము మాట్లాడుకునే ఏర్పాటుగల అభివృద్ధి జరిగితే, మనుషులు ఆ యంత్రాలకి తాను మాట్లాడదలుచుకున్నది ఫీడ్ చేస్తే సరిపోతుంది కదా అని. ఆ రోజు తప్పకుండా వస్తుంది.

# ఇటాలియన్స్ గొప్పతనం

మనిషికి మనిషికి పడని దేశం ఏదంటే భారతదేశం అని తక్కున సమాధానం చెప్పగలడు రోజూ దినపత్రిక చదివే కుర్రాడు కూడా. ఇలా పడకపోవడానికి అనేక కారణాలు. మతం ఓ అడ్డుతెర అయితే ఒకే మతంలోని వారికి కులం శతృవవుతోంది. ప్రభుత్వం సమాజంలోని ఓ వర్గానికి వుద్యోగాల్లో రిజర్వేషన్స్ లేదా మరేదో రాయితీనో ఇస్తే ఇంకో వర్గం వారు విరుచుకుపడతారు. ఇలా చిన్న కారణం దొరికితేచాలు. ప్రజలు తమలోతాము విభేదాలు సృష్టించుకుని ఒకరిమీద మరొకరు దాడులు చేసుకుంటూంటారు.

ఒకప్పుడు మా ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడారు కొందరు. ఇప్పుడు ఏకంగా 'మా రాష్ట్రం సెపరేట్ దేశం అవాలి' అని పోరాడుతున్నారు. ఐకమత్యాన్ని బలవంతంగా రుద్దుతోందా మన ప్రభుత్వం అనిపిస్తూంటుంది దినపత్రిక చదువుతూంటే.

ఇలా పరాయిమనిషి పొడగిట్టని విధానవలం ఇండియన్స్‌కేనా లేక ప్రపంచం అంతటా ఇలానే వుందా అని ప్రశ్నిస్తే సమాధానం 'కాదు' అనే వస్తుంది. విడిపోయిన రెండు జర్మనీలు కలిసి ఏక జర్మని అయింది. సోవియట్ రష్యాలోంచి కొన్ని విడిపోయి స్వతంత్ర దేశాలయాయి.